# ఉప్పు బస్తాలు

తల్లి కూరముక్క అడిగింది. కోడలు పెట్టలేదు. అది కోడలుకాదు. కొడుకు దాన్ని వుంచుకున్నాడు. దానికో కూతురు పుట్టింది. ఆ చంటిపిల్లను సందిట్లో వేసుకుని ముసిల్ది చితుకులేరి కట్టలు కడుతూ కోడలికి శాపనార్థాలు పెట్టింది. ముసిల్ది వేరే యింత అన్నం కుండలో ఉడ కేసుకుని, ఉప్పుగల్లో పచ్చిమిరపకాయో నంజుకుని, యింత గంజినీళ్ళు తాగి పడుకుంది. అది అప్పుడప్పుడు కూరముక్క కోసం అడిగి లేదనిపించుకుని కోడలితో యుద్ధం చేస్తుంది. కూరముక్క వాళ్ళు పెట్టరు కొడుకూ కోడలూ వండుకున్నది తిని లోపల దీపం ఆర్పేసి తడిక దగ్గరగా తోసి పడుకుంటారు. ముసిల్ది యివతల చూరుకింద చింకిబొంత వేసుకుని పడుకుని కూరముక్క కోసం గొణుక్కుంటూ చంటిపిల్లను చూసుకుంటూ పడుంటుంది.

ఆవేళ కొడుకు రాగానే ముసిల్ది తిట్లకు లంకించుకుంది. కోడలు లోపలినుంచి తిట్లకు పైతిట్లు విసిరింది. వాడు తల్లిని త్రోసి వీపుమీద దబదబా మొత్తాడు. "లంజా-ముండా-ఫో ముందు" అని తిట్టికొట్టి ' కూరముక్క' మాటెత్తవద్దని ఆ స్పీడులో లోపలికెళ్ళి పెళ్ళాన్ని క్రిందపడేసి కాళ్ళతో చితకతన్నాడు. వాడసలు ఏదీ వినిపించుకోడు. ఇద్దర్నీతన్ని కూతుర్ని ఒళ్ళో కూర్చోపెట్టుకుని కుండలోని అన్నం సత్తు గిన్నెలోకి వంపుకుని కూరంతా మెక్కి బ్రేవ్‌మని తేన్చి "ముండల్లారా కూరముక్కమాట ఎత్తారంటే ఎముకలు పచ్చడి చేస్తానని అంతిమవార్నింగిచ్చి, పిల్లను చాపమీద పడుకోబెట్టి, సైకిలు బెల్లు వాయించుకుంటూ టింగురంగలా వెళ్ళిపోయేడు.

ముసిల్ది కూరముక్క తగు పంచాయితీ పెట్టింది. అది చితుకులు ఏరి, కర్రదుంగలు తెచ్చి, చిన్న చిన్న ముక్కలు కొట్టి, కట్టలుకట్టి, పదిపైసలకు పావలాకు అమ్ముతుంది.

ఉప్పు బళ్ళవాళ్ళ ఆడంగులు, ఆ కట్టెల్ని ఎప్పటికప్పుడు డబ్బులిచ్చి కొంటారు. ముసిల్ది ఆ డబ్బులతో ఓ పూట వండుకుని వండుకోక యింత గంజితాగి పడుంటుంది. దాని డబ్బుల్లో ఐదు పైసలు పెట్టి ఆముదం కొని చంటిపిల్ల మాడుకు రాసి, రోజూ ఉదయం దాని దగ్గర మిగిలిన చితుకులతో వుడుకు నీళ్ళు కాచి పిల్లకు తలంటి నీళ్ళు పోస్తుంది. పోయ్యి వేరే అయినా కోడలు తనకు "కూరముక్క" పెట్టాల్సిందేనని ముసిల్దాని వాదం. కోడలు పడనివ్వదు. అలవాటు చేస్తే రోజూ పెట్టాలి. అందుకని దెబ్బలాట వేసుకుంటుంది. మా సంసారం మాకే గడవదు. నీకెక్కడ తెచ్చిపెడతానంటుంది. కొడుకు యింటికి రాగానే రోజూ ఈ తగూ రడీగా వుంటుంది. వున్నది వాడు తినేసి ఇద్దరినీ తన్ని వాడింట్లోంచి లేచిపోతాడు. ముసిల్ది ఈతగూ పంచాయితీ పెట్టింది. ఇలాటితగూల్ని తీర్చటానికి ఉప్పుబస్తాల కంట్రాక్టర్ నాయుడి దగ్గరకే అంతా బీదా బిక్కీ ముసిలీ ముతకా వెళతారు. నాయుడి పూర్వాశ్రమంలో హెడ్డు. అతన్ని అంతా హెడ్డుగారనే పిలుస్తారు. అతన్నీ పోలీసు నవుకరీలోంచి డిస్మిస్ చేశారని కొందరంటారు. కాదు రిటైరయ్యాడని మరికొందరంటారు. ఇప్పుడు తను ఉప్పుబస్తాల కంట్రాక్టరు. ఉప్పు బస్తాల్ని కొని స్టాక్ చేస్తాడు. ముసిల్దాని జాగాలో వెనక పెద్ద నిట్రాళ్ళ పాకవేసి దాన్ని ఉప్పుబస్తాల గోడవున్‌గా వాడుకుంటున్నాడు. అతను గొంతు చించుకు తప్ప మాట్లాడడు. ఒక కాపీయింగు పెన్సులు, ఒక నోటు పుస్తకం పుచ్చుకుని నులకమంచంమీద కూర్చుంటాడు. ఆ నులకమంచం రోడ్డు దిగువనున్న ఖాళీ జాగాలో వేస్తాడు. ఆ మంచంక్రింద నుంచి ఒక మురికికాలవ పారుతూ వుంటుంది. ఆ నులకమంచం మీద అతను భాసింపట్టు వేసుకూర్చున్న రిటైరయిన యముళ్ళా వుంటాడు. అతనికెదురుగా ఉప్పుబళ్ళు లాగేవాళ్ళు ఉప్పుబళ్ళు వుంటాయి. అవి సుమారు ఒక డజను బళ్ళుంటాయి. తెల్లవారకుండా, ఆ ఉప్పుబళ్ళలో ఒకటో రెండో ఉప్పుబస్తాలు వేసుకుని పనివాళ్ళు ఊరంతా తిరిగి అమ్మి సాయంత్రం వచ్చి డబ్బులు అప్పగించి తమకు రావలసినది. మినహాయించుకుని వెళ్ళిపోతారు.

ఇదేమంత సులువయిన వ్యవహారం కాదు. ఉప్పుబస్తాలు అమ్మేవాడు బండి సంపాదించాలి బండి సెకండ్ హ్యాండుది నలభై యాభై రూపాయలుంటుంది. కొత్తది నూరుదాటి పలుకుతుంది బండి అద్దెకు తేవాలి ఒక రూపాయో అర్ధో బండికిరాయి కింద పోతుంది. బస్తానో రెండు బస్తాలో షావుకారు నాయుడి దగ్గర ముందు పైసలిచ్చి కొనుక్కోవాలి. అందరికీ షావుకారు అరువు పెట్టడం ఎనిమిది తొమ్మిది రూపాయలు మదుపు పెట్టాక ఆ బండి లాక్కుంటూ "ఉప్పో, ఉప్పో" అని అరుస్తూ వీధి వీధి తిరగాలి అమ్మాక అందులోనే వాడిపొట్ట గడవాలి. "పెళ్ళాం బిడ్డలు తిని బతకాలి. అది ఎలాగూ చాలదు. చాలదుకదా అని ఆ వచ్చింది తాగేసి పడుకుంటే పెళ్ళాం తగూ పెడుతుంది. షావుకారు సొమ్ము ఇవ్వకపోతే తగూ పెడ్తాడు. అంచేత కొంత మంది

తాగేసి వచ్చి షావుకారు చేత తన్నులు తింటారు. పెళ్ళాం చేత తిట్లు తింటారు. ఈ తగూలన్నీ రోడ్డుమీదే జరుగుతాయి.

ఈ ఉప్పుబళ్ళవాళ్ళ ఆడంగులు కూడా యిళ్ళలో కూర్చోరు. పాచిపన్లు చేసేవాళ్ళు పాచిపన్లు చేస్తారు. కూలి కెళ్ళేవాళ్ళు కూలి కెడతారు. చంటిబిడ్డల తల్లులుకూడా పిల్లల్ని ఏ మెట్లమీదో, చెట్టుకిందో రోడ్డువారనో పాతగుడ్డ వేసి పడుకోబెట్టి పన్లు చేసుకుని వస్తారు. ఆడవాళ్ళకు చుట్టకర్చు సినిమా కర్చుతప్ప వేరేకర్చులేదు. ఆ అమ్మా యీ అమ్మా చేయినిదిపితే, కూరో నారో ఇంత అన్నం కరడో తెచ్చుకుని తింటారు. వండి పెట్టేది మొగుళ్ళకే, ఈ ఆడంగులు కూడా ఐదూ పదీ పోగు చేసుకుని కూరా నారా అమ్మో జామకాయలు, సీతాఫలాలు, సపోటాలు అమ్మో రూపాయీ రెండూ లాభం సంపాదిస్తారు. స్కూళ్ళ పక్కన గోనెపట్టా పర్చుకుని అందుమీద చిరుతిళ్ళు వేరుసెనగ కాయలు, తేగలూ, బఠాణీలు మరమరాలు అమ్మి సంపాదిస్తారు. ఇలా చీమూ నెత్తురూ కూడా పెట్టి సంపాదించిన దాంట్లోంచి కొంత మిగిల్చి ఉప్పుబస్తాలు అమ్మే మొగుళ్ళకు బళ్ళు కొనిపెట్టిన వాళ్ళున్నారు. బండికి కిరాయికట్టినవాళ్ళున్నారు. ఇంత కష్టపడి వాళ్ళు సహాయంగా వుంటుంటే భర్తలు తెచ్చినది తాగేసి, షావుకారికి అరువులు పెట్టేసి, గొడవలు తెస్తుంటే వాళ్ళు తిరగబడి దెబ్బలాడటంలో ఆశ్చర్యం ఏమీలేదు. ఆ తగువులు కూడా రోజుకి ఒకటో ఆరో హెడ్డుగారే తీరుస్తుండాలి.

హెడ్డుగారు ఆడ తగవులూ, మగతగవులూ, ముసిలి తగువులే కాక వాళ్ళ సంసారాల్లో వచ్చే గొడవలన్నీ కూడా విని సబుబూ సందర్భము చెప్పాలి. ఇతను తీర్చిన తగువులన్నీ తీర్పుప్రకారం సజావైనవి కాదు తాత్పర్యం. హెడ్డుగారికి ఉప్పుబస్తాలు కదలాలంటే బళ్ళుండాలి. పని వాళ్ళుండాలి. వాళ్లు నమ్మకంగా తన సొమ్ము తనకు ముట్టచెప్పే వారై వుండాలి. ఈ వ్యాపారంలో తను మునిగిపోకుండా వుండాలంటే ఉప్పుబళ్ళవాళ్ళ వ్యవహారాల్లో పెద్దరికం వహించక తప్పదు. అందుచేత అతనెప్పుడూ ముఖం చెండుకుని బిగ్గరగా మాట్లాడతాడు. నాయిడు కట్ బనీను వేసుకుని పూర్వాశ్రమంలో సంపాదించిన కాకీ నిక్కరు వేస్తాడు లేదా షర్టు వేసుకుని పంచె కడతాడు. అతని దగ్గరో కొత్త హెరుక్యిలిస్ సైకిలుంది. దానినిబట్టి అతని సంసారం పచ్చగా వుందని గ్రహించాలి. అతను యజమానిగా షావుకారుగా వుండవలసినంత యడంలో వుంటూ కూడా, మనిషైపోయి వాళ్ళలో కలిసిపోతూ వుంటాడు. ఆడంగులకి హెడ్డుమీద గురివుంది. ఉప్పుబళ్ళు లాగేవాళ్ళకి భక్తి వుందో లేదో చెప్పలేం కాని భయం మాత్రం వుంది. భయమంటే బండి లాక్కుంటాడని" భయం. ఉప్పుబస్తా లివ్వడేమోనని భయం. కార్మికుల మంచి చెడ్డలతోటే కాక, కార్మికుల కుటుంబాల మంచి చెడ్డలతో కూడా యజమానికి ప్రమేయం ఉంటుంది కార్మికులు పని మానేసి దెబ్బలాడుకుంటూ కూర్చున్నారంటే పస్తులు వుండాల్సి వస్తుంది. పని

స్తంభించిపోతే ఉప్పుబస్తాలు కదలవు. నాయుడు గారు కూడా నష్టపోవాల్సివస్తుంది. నాయుడు గారికి నష్టం వస్తుందేమోనని భయం. అందుచేత అతను జాగ్రత్తగా వాళ్ళ విషయాలన్నిట్లో శ్రద్ధ తీసుకుంటాడు.

ముసిల్ది కూరతగూ తెచ్చే సమయానికి అక్కడ మరో దెబ్బలాట జరుగుతోంది. అక్కడో ఆడది హెడ్డుముందు ఏకరువు పెడుతోంది దాని కడుపులోని బాధ.

ఈడికి మొన్న సుట్టు కొత్త మాస్సెకి కొత్త బనీను నాన్నే కొనిచ్చినాను. తలంటు నీళ్ళోసి యిందరా సుట్టుకోమని తువ్వలనానే తీసిచ్చినాను. ఏవిరా- పలకవు? నానిచ్చినానా నేదా? అని వాడి తలకు వున్న తుండులాగి హెడ్డు మంచం మీద పారేసి గుండెలు బాదుకుంటూ రాగాలెట్ట నారంభించింది.

హెడ్డు: "ఆగవమ్మా ఆగు! యింతకీ తగువేటి చెప్పు-"

ఆమె: "బాబూ యీడి బండికి యినపసుట్లు ఏయించినపుడు నా కాలి ఎండి గుల్ల కడియాలు అమ్మినానా లేదో సెప్మనండి."

అతను (భర్త) "ఇచ్చినావే-నా నిప్పుడే టన్నాను? ఇవ్వలేదన్నానా?"

ఆమె:- "మొన్న సంకురేత్రికి యీడికి పంచల సాపు పెట్టినానా లేదా అడగండి."

భర్త:- "పెట్టినాయే పెట్టినావు. నాను కాదన్నానా!"

ఆమె:- "మరిప్పుడీడి కేటీపోగాలం? నాకు తిండికి రూపాయిన్నరీకుంటున్నాడు."

భర్త:- "నా దగ్గర లేయే-ఉంటే నానివ్వనా-"

ఆమె:-వోరినీ జిమ్మడ. నువ్వు తాగేస్తున్నావురో... యీడ్ని నమ్మకండి. డబ్బు లివ్వడింటికాడ. నా బిడ్డలూ నానూ ఏటి కావాల్రో దేవుడా!"

హెడ్డు:- "రోజూ డబ్బు లివ్వటం లేదేట్రా యింట్లో?"

భర్త:- మీ సోమ్మిస్తే మీ రూరుకుంటారేటి? మీ కిచ్చాక నా కాడేటుంటాదండి? సింకి సంచీలో సిన్ని పైసలుంటే రోజెల్లా గడుస్తాదండీ?"

హెడ్డు:- "అంతా నా కెక్కడస్తున్నావురా రాస్కెల్? నాకే అరువు పెడుతున్నావు?"

భర్త:- "మరా మాటే సెప్పండి దాన్తో-మీరు సెప్తే యినుకుంటాది? నాకాడేటుంది? టీ సుక్కల్తాగడం కూడా తప్పేనా అంట?"

హెడ్డు:- "వోరి-నీవాటా రెండున్నరో, మూడో మిగుల్తుందా లేదా? అందులో ఓ రూపాయిన్నర డబ్బులు దాని మొహన కొట్టరా..."

భర్త:- "నాకాడెలాగ మిగుల్తాదండీ? మీ కరువెట్టినట్టే దానికీ అరువెడ తన్నాను. మీ రూరు కొంటున్నారుగాని అది వూరుకోడం నేదు. నోరింత జేసుకుని ఒంటి కాలిమీద నెగిసిపోతుంది నా మీన."

ఆమె:- "ఓరోరి-నాకు తిండికి డబ్బులు అరువెడతావా? నా నొప్పను. నా నొప్పను.

నా గుల్ల కడియాల డబ్బిచ్చేయ్. నాను కొన్న తువ్వాల బనీనూ పంచె డబ్బిచ్చేయ్. నీ బండికి నాను మదుపెట్టిన నలభై రూపాయలిచ్చెయ్, యిచ్చెయ్" అని ఆ ఆడమనిషి ఉప్పు బండి చక్రాన్ని కదలనివ్వకుండా పట్టుకు నిలేసింది. దాని మొగుడు బండితోలనివ్వకపోతే నేనేటి సంపాదిస్తానని అన్నాడు. బండి కదలకపోతే హెడ్డుగారిక్కూడా నష్టం రాక తప్పదు. అందుకని హెడ్డుగారు జేబులోంచి అర్రూపాయ తీసి దాని చేతిలో పెట్టి బండిని వదలమన్నారు. అది ఆ అర్రూపాయాలూ దాని మొగుడి మొహాన్నేసికొట్టి " నా నలభై రూపాయాలూ గుల్లకడియాల సొమ్ము, తుండూ పంచెల సాపు సొమ్ము తిరిగిస్తే కాని, బండి నివ్వనని మొండి పట్టుపట్టేసింది. బండి నాది నా బండి నేనమ్ముకుని నా సోమ్ము నేను రాబట్టుకుంటా"నని వాదించింది.

దానికి మొగుడిమీద ఆ క్షణంలో విరక్తి కలిగింది. దానికి వాడిమీదున్న భ్రమలన్నీ పటాపంచలైనాయి. అది మొగుడ్ని ముద్దుచేసిన మాట నిజమే - చివరకు హెడ్డుగారామాటే అన్నాడు.

"వాసే-ఆడికి తలగుడ్డా పంచల చాపూ కొనిపెట్టమని నిన్నెవరడిగారు? ఆడి బండికి నీ గుల్ల కడియాలు చెరిపించి ఇనప సుట్లు చేయించమని ఆడడిగాడా నిన్ను? కిరాయి బండి లాక్కుంటుంటే నివ్వే ఆడికి బండి కొనిచ్చావు. నీ కిష్టమై కొనిచ్చావా లేదా-" అది తల వూపింది.

"మరలాంటప్పుడు ఆ సొమ్ము తెమ్మంటే ఆడిప్పుడెక్కడ్నుంచి కొట్టుకొస్తాడు? లెగు-లెగు-బండికాడ్నుంచి లెగు'' మరో రూపాయిస్తున్నాను నా సొమ్ములోంచి ఈ ఏడ్రూపాయలూ పట్టుగెళ్ళి వాడుకో- ఆడదానివని సూస్తన్నాను. ఇసిరా తల పారేగల్ను. ఏటనుకొన్నవో? మరి జబర్దస్తీ సాలించు. అని హెడ్డు ఏడ్రూపాయలు దాన్చేతిలో పెట్టి దాన్ని నెమ్మదిగా చక్రం దగ్గర్నుంచి లాగి పంపించేసి "ఎదవముండా కొడకా-సన్నాసేదుపు లేడక దానికి రూపాయి ముచ్చవుకాయిచ్చెయ్ ఈ రోజునుంచి తాగుడెందుకురా నీకు-లంజకొడకా. చూశావా- అదే రైటు- మాయలో పెట్టి దాన్ని పంపించేశాను. అది ఏడుస్తూ ఎల్లిపొయింది. దానుసురు నీకు తగిల్తే మసైపోతావురా రాస్కెల్ అని దులిపాడు. ఆ వెళ్ళిపోతున్న ఆడమనిషికి ఆ ఏడ్రూపాయలమీద ఏవీ భ్రమలేదు. తానన్నీ కొనివ్వడం తనదే తప్పన్నాడు హెడ్డుబాబు. దాని మాతృత్వపు పునాదుల మీద గట్టిదెబ్బ కొట్టాయి మాటలు. "పగలల్లా అదట్టాగే అరుస్తాది, అన్నాడు దాని మొగుడు తలపాగ చుట్టి. ఉప్పు బండిని రోడ్డుమీదకు లాగుతూ, ముసిముసి నవ్వులు నవ్వుతూ.

హెడ్డుబాబు ముసిల్దాని కేసి తిరిగి- "ఏటి మామ్మా" అన్నాడు.

ముసిల్ది బావురుమంది.

"కూర తగువేనా?" అన్నాడు మళ్ళీ.

"నీవ్ నిజం సెప్పు బాబూ! ఈజాగాపట్టా ఎవురిదా? నాదా, కాదా? ఆడేం సేసిందు నా కొడుకు? ఏలి ముద్దర్లేపించి ఆ ముక్క అమ్మిందు. సైకిలిసాపు పెట్టినాడు ఇప్పుడీడి ఉప్పు బస్తాల జాగా నాదేనా? ఆ సోమ్ము అడే కాజేసిందు. ఈడి పిన్నమ్మ వయసు అబోగం-తో పోతావుంటే, నా నేనా నీకాడ తగువు పెట్టి నా కొడుక్కి పెల్లి సేపిద్దామని మాట్లాడింది? పెల్లి కాలేదు. ఎవత్తినో ఓతిని ఎంటెట్టుకొచ్చాడు. ముసిలి ముండవ్ సూరు కింద సావే అన్నాడు. దానికి సీరలెచ్చాడు రవిక లెచ్చాడు. ఎంటేసుకుని తిప్పాడు. దాని కడుపులో కాయకాస్తే నా రకతంలో రకతవనే కదా అగుంట ముండకు నీల్లోసి ఆవదం రాసి రోజూ పదిపైసలు పావలా ఖర్సు చేస్తున్నది. ఆ పావులాకి నాకు కూరముక్క రాదా? వస్తాది. కాని ఆదెందుకు ముసలిముండా నువ్వీకూర ముక్క నంజుకోయే అనకూడదా? నాకా అక్కు నేదా అని పెద్దమడి సివినిన్నడగతన్నాను నా కంటికి సూపునేదు. కోడలుముండ మాత్తరం అత్తముండా ఈ సేపముక్క కొరుక్కో. ఈ రొయ్యల పులుసు నంజుకో అనదేవి?" అని కొంచెం ఆగి "ముసిల్దానికి తిండిమీద బెమపోడం తప్పా! నివ్వే సెప్పుఎద్దుబాబూ!" అని కళ్ళు తుడుచుకుంది. ఏళ్ళు ముదిరి కీళ్ళు సడిలి, వీధిలో పారేసిన ఒడిలిపోయిన వంగపండులాగుందా ముసిల్ది.

హెడ్డు నులకమంచం మీద సర్దుకుని కూర్చుని "ఈ మాత్తరానికి తగువెందుకు? నీ కుండా నీ ఖొణ్ణం నివ్వే ఒండుకుంటావుగదా! కూరముక్క కొనుక్కోరాదా? ఆ పావలా పరకా చితుకులేరి పోగుచేసి ఆ గుంటముండకు ఖర్సు సెయ్యమని ఆల్లతో తగువు పడమని ఎవురు సెప్పారు నీకు? పావలిలాగిచ్చెయ్. నీకు ఎండుసేపలే తెప్పించి పెడతాను. సరా..." అన్నాడు.

ముసిల్ది సూదుల్లాటి సూపులతో గుచ్చి చూసింది. "హెడ్డుబాబూ! నువ్వు సెప్పినపాటి నాకు తెల్దేటి? మాంసం నేను తినలేదా. సేపల పులుసు నే నెరగనా-దరమం సెప్పమన్నాను గాని...

"సర్లె మాపిటికాడు రాంగానే పిలిసి నివ్వన్నట్టే అడుగుతాను."

"అడగడం కాదు బాబూ! పదిమందిలో నిలెట్టి ముసిల్దానికి కూరముక్క ఎట్టలేని నువ్వే మొగోడివిరా ఎదవా అని జలకడిగెయ్యి."

"అలాగలాగే!" అని హెడ్డు బుర్ర వూపి చెవిలోంచి పెనిసలు తీసి పుస్తకం మీద లెక్కలు రాసుకుంటూ కూర్చున్నాడు.

అక్కడే మట్టిలో ఆడుతున్న మనవరాలి ముండను చంకనేసుకుని ముద్దులాడుతూ ముసిల్ది లోపలికెళ్ళింది.

అంతలో మరో తగు వొచ్చింది. వాడూ ఉప్పుబండి వాడే! ఇద్దరూ కొట్టుకున్నారు. బక్కగా తాచుపాములా వున్నవాడు దుక్కలా దొంగమొగం వేసుకున్నాడిని చావ చితక

గొట్టేశాడు. దుక్కవాడి పెళ్ళాం ఆడపులిలా రంయ్-రంయ్ మంటూ వచ్చేసింది బూతులు తిడుతూ. సన్నగా రివటలా వున్నవాడు లావాటివాడిమీద పడిపోయి కుమ్మేస్తుంటే ఆడపులి వెళ్ళి కరిచేసింది. "అమ్మ లంజా" అని కొంగుచ్చుకుని పరపరా లాగేశాడు ఒంటిమీద బట్టని. అదెళ్ళి మునిసిపాలిటీ చెత్త కుండీలో కూర్చుంది. కూర్చుని బండబూతులు తిడుతోంది. ఎద్దెళ్ళి ఆ దిసమొలదానికి తనపై మీది తుండు పారేసి సన్నటాడ్నోదిలేసి లావుపాటి వాడికి రెండు తగల్నిచ్చి "చెప్పు లంజకొడకా ఏం జరిగింది?" అని దబాయించాడు. ఈ తగువు చూస్తున్న జనానికి సన్నటాడ్ని ఎందుకు కొట్టలేదా అనే దవుటు కలిగింది. ఆ ముక్కే అడిగారు.

"ఈ దొంగమొగం వాడున్నాడు చూశారా-ఈడేనండి ఈ తగువుకి మూలం. ఆడి బజ్జారాడికుంది. ఈడి బజారీడికుంది. ఆడి కొట్లన్నిటికీ ఈడెళ్ళి ఉప్పు తోలడం సవబేనా? ఇలా దగుల్బాజీ పని చేయటం యిది మూడోసారీ నెలలో- సీ! కుక్క బుద్ధి."

"మరి మొగాళ్ళ మొగాళ్ళ తగువుల్లో అదెందుకు రంయ్ మంటూ దిగడం?" అన్నారెవరో!

"దానికి టెంపరు నావు బాబూ!"

"అందికే అది చెత్తల కుండీలో నంగా దిగడింది."

"దానికి టింపరు నావైతే నడిరోడ్డుమీద దాని కోకలాగెయ్యమన్నారు కావును. దాని సీర దాని కిప్పించెయ్ ఎడ్డుబాబూ!"

"ఓ రెర్ర మిరపకాయ్. దాని సీరట్టిగెళ్ళి దాని మొహాన కొట్టీరా!"

అది చెత్తకుండీలోంచి దూకేసి చీకట్లోకి పారిపోయింది సీరుచ్చుగుని.

"మరిం కేటి రోజుల్లా తగువేనా!... యాపారం లేదేటి? బస్తాకి రూపాయిచ్చేయిండి బస్తాలొగ్గేసినోళ్ళు-" అని గర్జించాడు ఎద్దు. అంతలో-

"గురో దీని కేరత్రు మంచిదికాదు" అంటూ తాగే సొచ్చా దొకడు. వాడి వెనక్కాలే వాడి సతీమణీ అరుచుకుంటూ ప్రవేశించింది.

"ఎడుబాబూ! నేనాడదాన్ని. నాన్లంజనే...నానొప్పు కుంటాను నేనాడికాడీడికాడ తొంగుంతా న్నాకిష్టవైతే. నాకు ముగ్గురు బిడ్డలు. ఆళ్ళని నానేటి పెడతాను? నానేటి తింటాను?" అని కడుపు బాదుకుంది.

"ఇది సంద్రవే యిది కడుపుకాదు. ఇలాటి మూడు సంద్రాన్ని నాను మేపాల. ఈ లంజీకొడుకు నా మొగుడు-నా మొగుడేటి? తాగీసొచ్చినాడు. పావలా పరకిచ్చానని నాకు సెప్పమనండి."

"ఆడుకాదే లంజా నువ్వే తాగొచ్చినావ్" అని గుడ్లెర్ర చేసాడు ఎద్దు దాని ధోరణికడ్డొస్తూ.

"మరల్లాగడుగు బాబు దాన్ని. దాని కేరత్రు మంచిది కాదు."

"నువ్వొల్లకుండొరే- అవునుగాని. పబ్లీకున ఎబిచారినని సెప్తావుటే లంజా?" అని ఎడ్డు కోపంగా ఆ ఆడదాన్ని ప్రశ్నించాడు.

ఆడలక్షణాలన్నీ గాలికెగరకొట్టేస్తూ ఆ డేంజరస్ మహిళ అందుకుంది ఆవేశంగా.

"ఆ మాటమీద నిలబడు ఎడ్డుబాబూ! నా నెబిసార్నే-కానీ యీడ్ని కట్టుకున్నాక నీతిగా నిలబడ్డానా లేదా? లేదనమను. ఆడికి పుట్టిన ముగ్గుర్ని నీ కాళ్ళకాడ పీకలత్తెగ్గోసి నానెల్లిపోతాను ఏట్లోకి. మా బతుకులేం బతుకులు బాబూ- సీ. ఎదవబతుకులు అని కాండ్రించి ఉమ్మేసింది. కాలితో నేల చరుస్తూ "నా నెబిసార్ని, మళ్ళీ ఎప్పుడైనానో కనుకో!" అని పొట్ట బాదుకుని "ఇల్లిదిగో యిక్కడుంది అగ్గి ఆ అగ్గి రాజుకుంటే కాని పని కుక్క మాంసమైనా కక్కుర్తిపడని ఓడెవడైనా వుంటే నువ్వే సెప్పు చెప్పుచ్చుగ్గొట్టు పడతాను."

"సర్లేయే నువ్వు పతివ్రాతవే! కాని అప్పుడప్పుడు నీ కేరట్రు మంచిది కాదవునా?" అన్నాడు మొగుడు. "అవున్రా నువ్వు తడి గుడ్డతో నా బిడ్డల పీక కోసిపోతావుంటే, తాగి తందనాలాడతావుంటే నాను కాని ముండనని పించుకునే, నానీ పిల్లకి వొణ్ణం ఎట్టి గుంతున్నారు. వొంట్లో మాంసం అమ్మి నా పిల్లల్ని సాకుతున్నాను. ఇది తప్పనే నోడెవుడైనా వుంటే నా ముందుకు రమ్మను" అని అరిచింది భద్రకాళిలా.

ఎడ్డు కొంచెం తగ్గాడు. తగ్గి జేబులోంచి రెండ్రూపాయల్తీసి "అమ్మ యీ రెండుచ్చుగుని నువ్వింటికెల్లిపో. ఒరే ఎదవా- ఆయమ్మి నీ బిడ్డల్తల్లి, దీన్ని బజారుమీదకి తరివేసి నీ కేటిరా సినిమాలు షికార్లూ- ఇదిగో అమ్మీ నీకు ఓరానికి ఐదు రూపాయలిస్తాడు. నాకాడొట్టు గెళ్ళు మరి మాట్లాడకు. రోడ్డుమీదల్లరిసెయ్‌కు. ఎల్లు. తిన్న గెళ్ళి కూడొండుకుతిను" అని తుఫానులాగొచ్చిన ఆ ఆడదాన్ని పంపిచేసి, హఠాత్తుగా జ్ఞానోదయమైనవాడిలా పక్కనున్న శిష్యుడ్ని పిల్చి "ఓరి బాబూ? ఆ చెత్తకుండీలో లంజె నా తువ్వాలెత్తుకు పోయిందిరా. బేగెల్లి వొట్టుకురా- మూడ్రూపాయిల ముచ్చవుక టవల్రా ముచ్చటపడి కొన్నాను..." అని వాపోయాడు హెడ్.

కూర తగూల్ని. కుక్క తగూల్ని అన్నీ తీర్చాక ఎవరింటికి వాళ్ళు వెళ్ళాక మంచం ఎత్తేసి, గోడవును పాకలో పడేసి, ఓ సోడా తాగి కుర్రాడితో చిల్లర రేపిస్తానని చెప్పి, సైకిలు స్టాండ్‌తీసి నడిపించపోయేసరికి వెనక చక్రంలో గాలిపోయి బండి నేలకతుక్కు పోయిందని తెలిసింది హెడ్డుబాబూకి దాన్తో లోకంమీద చిర్రెత్తుకొచ్చింది. గాలి లేని సైకిల్ని నడిపించుకెళ్తూ-

"ఇదేటి లోకం? ఇదేటి మాయ- ఈ లోకవిలాగెందుకుంది? ఈ మడుసులిలాగె దుకున్నారు! రోజల్లా వీధి వీధి తిరిగి ఉప్పమ్ముకుంటూ రెండ్రూపాయల్డబ్బులు రాలడం కష్టం గదా? ఆళ్ళ కష్టంమీద నేను బతకాలి. గోతికాడ నక్కలాగ ఈ కుళ్ళు కాలవమీద నులక మంచవేసుకుని ఒక్కొక్కడి దగ్గరా మొల్లో సెయ్యెట్టి వసూలు సేస్తేనేగాని నా

డబ్బులు నాకు రావు ఈ ఉప్పుబస్తాల డబ్బులు వసూలు చేసుకుందుకు, ఆళ్ళ కూర తగూలూ, లంజల తగూలూ అన్నీ తీర్చాలి. నేనేటి పీడర్నా, జడిజీనా, రిటైరయిన పోలీసోడ్ని. నాకు దెలిసి చచ్చినంతమటుకూ రావుడు భీవుడ్ని కొడితే భీవుడి సోవుడ్ని కొడతన్నాడు. నన్ను ఉప్పుబస్తాల లారీవోళ్ళు కూలీవోళ్ళు వాన దేవుడు కొడితే, నేనీళ్ళని కొట్టక తప్పటంలేదు. కూర ముక్క ముసిల్దేటంది? చావుకు కాళ్ళు సాచినముండ, నాకు కూర ముక్కకు అక్కు లేదా దరమం సెప్పమంది. పని సేయటానికి అక్కుందిగాని తినడానికి అక్కు లేదా అని అడిగింది. దంగైపోయానా లేదా? ఉప్పు బండీలాగే ఎదవకి, బనీనూ తువ్వాలా ఆడి బండికి గుల్ల కడియాలమ్మి ఇనప సుట్టేయించిన ఆడది రూపాయిన్నర డబ్బులకోసం బండీ చక్రాన్ని తిరగనివ్వకుండా సతీ అనసూయ సూరుడ్ని అడ్డినట్లు అడ్డిందా లేదా? దాని మొగుడిమీద తిరగబడిందా అది! కాలచక్రాన్నే పట్టుకుని ఆపేసెలాగ దెబ్బ లాడిందే? అవున్నిజవే-తిండే లేకపోయాక యీ పెపంచకంలో మడుసుల కేటుంది? తిండికోసం దెబ్బలాడ్డానికి దానికే అక్కుందా లేదా- వుంది. ముగ్గురు బిడ్డల తల్లి, తాగినోడి పెల్లాం మూడు కడుపులు మూడు సంద్రాలంది. ఒంటి మాంసం అమ్ముకునేనా నా పిల్లలకి తిండి పెట్టాల-పెడతానని మంగమ్మ శపథం చేసిందది. దానిమాటా నాయవే- అది పబ్లీగ్గా మొగుడికాడ పతివ్రాతనే, తిండికాడ ఎబిశారం సెయ్యక తప్పటం లేదంది. ఈళ్ళిలాగై పోడానికి ఈళ్ళు చేసిన పాపవేటి? ఈళ్ళు దొంగతనాలు చేస్తే, లంజతనాలు చేస్తే శిక్షించడానికి జైళ్ళున్నాయి. ఈళ్ళని రక్షించడాని కెవడున్నాడు? ఒకడూ లేడు. ఇలాటెదవల కోసం గవర్మెంటు ఏటిజేస్తుంది? దేముడిలాటి గాందీబాబే, దేముడి తమ్ముడిలాటి నెహ్రూబాబే ఇలాటెదవల కేటి చెయ్యలేకపోనారు. ఇలాటెదవలకి ఓటు అక్కిచ్చి నేనోటిస్తా- నువ్వోటియ్యంటున్నారు. ఓట్ల పండుగొస్తే పెద్దబాబులొచ్చి డబ్బులిస్తారు, తాగిస్తారని తెల్సు -అంతకంటే మరేటి తెల్దు. ఓటు అక్కు వుంది కన్క ఓ గ్లాసుడు సారా దొరికితే దొరుకుద్దేనో, ఐదో పదో ముడుతుందేవో -అంతకంటె ఈ ఎదవలు పార్ల మెంటు కెడతారా? అసెంబ్లీ స్పీకరవుతారా? పెజానాయకులవుతారా? కూలోడు గవర్నరు కాడు గదా! కూలోడు పరిపాలించడు కదా! కూర ముక్క అడిగిన ముసిల్ది భరతమాత కాదు కదా! తిండిలేని ముండాకొడుకులకి రూల్సేటి, అక్కులేటి పవర్సేటి? అయ్యెవరి కున్నాయి? అన్నీ ఉంటే అయీ వున్నాయి. లేకపోతే ఏట్నేదు. రిటైరయిన పోలీసోడ్ని నేనేటిలాగాలోచిస్తన్నాను? నా దగ్గరిప్పుడేటుంది? పోలీసు వాసనుంది. ఆ వాసనుంది గనుకే అమ్మా- అయ్యా పెట్టిన పేరొదిలేసి 'ఎడ్డుబాబూ' అని అంతా నాకాడి కొస్తున్నారు నేనప్పురు క్లాసోడ్నా- కాను కాను. మరి నేనేటి? షాపుకార్నా! ఎనకచక్రంలో గాలి లేదు, ముందు రోడ్డు కనబడ్డంలేదు. లాంతరు స్తంభాలు ఎలగటంలేదు. నేను కిందోళ్ళలో మీదోడ్ని- మరింత కిందికెళ్ళి పోకుండా, కాల్జార కుండా జాగర్త

గుంటున్నాను. మీదకెళ్ళ గల్నా-ఎళ్ళలే నెళ్ళలేను. అంత మాయ మన్దగ్గిరలేదు" అని బీడీమీద బీడి ముట్టించి ఆలోచిస్తూ వస్తూన్న హెద్దుబాబుకి "కూర ముక్క తగూ" తెచ్చిన ముసిల్దాని కొడుకు కట్టేయబోతున్న సైకిల్ షాపవుపడింది.

"కట్టెయ్యకు-కట్టెయ్యకు. ఎనక చక్రానికి రెండు దెబ్బలు కొట్టు..." అని సైకిలు స్టాండేసి చెట్టుకి గొలుసుల్తో కట్టేసిన పాత టైర్లమీద హనుమంతుడిలా కూర్చున్నాడు. ఎర్రలాగూ మునుపెప్పుడో తెల్లగా వుండి యిప్పుడు సైకిలు షాపు మరకలతో నల్లగా తెల్లగా పొగలు పొగలుగా వున్న టెర్లిన్ చొక్కా వేసుకున్న రంగడు గాలి కొడ్తున్నాడు.

"అవున్రా రంగా ముసిల్దాన్ని సరిగా జూసుకోరాదట్రా-దాన్నెందుకలా గేడిపిస్తావూ..." అని ముసి ముసి నవ్వులు నవ్వుతూ అడిగేడు కూర ముక్క మాటెత్తకుండా.

"కొంచెం క్లాసుగుండాలంటే మావు సంపాదించింది మాకే సాల్దు గురూ!" అన్నాడు రంగడు.

"అదేట్రోవ్-క్లాసేటి? మనకి క్లాసేటి? అన్నాడు ఆశ్చర్యబోతూ హెద్దుబాబూ.

"నీకు తెల్దు గురూ! ఆడోళ్ళనెప్పుడూ యిడగొట్టి వుంచాల..."

"అదేటిరా రంగా?"

"ముసిల్దీ నా పెళ్ళావ్ కలిసిపోతే ఆళ్ళిద్దరూ మన్ని తినేస్తారు గురూ!"

"మరిద్దరూ జట్టీ వేసుకుని తిట్టుకుంటే నీ కేటిరా సుఖం?"

"తంతే ఆళ్ళిద్దరూ కంయ్-కంయ్ మనకుండా పడుంటారు. ఆళ్ళు కలిసిపోతే రాజ్జాలేలేస్తారు."

"ఓరి అందుకేనేటి ఈ కూర తగువు? ముసిల్ది బతికినన్నాళ్ళు బతకదు కదా... కుర్రముండని పేణంగా సూసు కుంటుంది గదా...దానికో కూర ముక్క పారేస్తే తగువు తెల్లారిపోద్దని నేనంటున్నాను."

"ముసిల్దాన్ని లోపలికి రానిస్తే మరక్కడ్నుంచి కదల్దు. మాకున్నది ఒకటే జాగా-నాకు కొంచెం క్లాసుగుండాలనుంటుంది. మేం పడుచోళ్ళం మావా! మా మద్దిన అదెల్లా గుంటుది? సబవు నువ్వే సెప్పు."

"మరలాప్పుడు దానికో పాకేపించు. ఓ రూపాయి డబ్బులు దాని మొహాన్న కొట్టు."

"నీకు తెల్దు మావా! మొగోడాపాటి ఉగ్రం సూపెయ్యకపోతే అత్తే-ఇత్తేమని మన్ని మింగేస్తారు. మనకాడేటుంది? టిఫిను-టీ సుక్కలు సినిమాల్లేకపోదే క్లాసుగుండదు. ముసిల్ది నాను సచ్చేనాటిదాకా బతికుంటే మనం జల్సా చేసే దెప్పుడు? ఇస్త్రీమడత లెయ్యాలనుంటది. క్లాసు హోటలుకెల్లాలనుంటది. వారానికో రెండు మూడు సుట్లు పిక్చర్ కెల్లాలనుంటది. నేను సంపాయించుకుని కర్సు పెడతన్నాను. ఓయిదాల మీద సేతి రేడియా కొనాలని ప్లానుంది."

"ఒరే బాబూ-ఓయిదాలమీద రేడియోకొను. ఓయిదాలమీద ముండనుంచుకో! ఓయిదాలమీద కన్న తల్లెలా గొస్తదిరా రంగా? నేనన్నానని కోపం చేసుగోకు. దానికో కూరముక్క పారేస్తే నీ కేటడ్డు? అది నీ జల్సాల కేటడ్డు? నువ్ క్లాసుగుండు నే కాదన్ను- పెల్లాం పక్కలో కొచ్చిందని తల్లిని తగిలేస్తావురా రంగా?" రంగడు మాట్లాడలేదు.

▯

ఉప్పుబస్తాల చాటున రంగడి పెళ్ళాం ఉప్పుబళ్ళ కుర్రాడెవడితోనో పడుకుండగా చూపు సరిగా ఆనని ముసిల్ది కర్రెక్టుగా పట్టేసింది. ఉప్పుబళ్ళ చాటున బస్తా వెనకాల అదిలాటి చీకటి తప్పుల్ని చాలా చేసింది రంగడు దాని వొళ్ళుహూనం చేసినా అది దాని నైజగుణం మానలేదు. ఎడ్డుబాబు అడ్డుకుని రంగడ్ని లాగి అది దెబ్బలకు సచ్చిపోతే నువ్వు జైలు కెళ్తావొరే! అక్కడ క్లాసుగుంటుంది నీకు" అని బెదిరించాడు,

"నేనాడి పెళ్ళాన్ని కాను. నాకాడు పుస్తికట్టిన మొగుడూ కాద"ని సోడాబండివాడితో వెళ్ళిపోయింది.

"ఒరే రంగా బతికి బయట పడ్డావురా" అని మెచ్చుకున్నాడు ఎడ్డు. ఉప్పుబస్తాలుండటం వలన ఉప్పు బళ్ళు వాకిట్లో వరసగా చేరటంవలన కూలివాళ్ళలో సరసాలెక్కువయాయి.

ముసిల్ది మళ్ళీ గుడిసెలో దూరింది. గుడ్డ ఉయ్యాలలో కుర్రముండ పడుకుని కేరింతలు కొడుతోంది రంగడు కూడు తింటున్నాడు చేపలకూర రొయ్యల పులుసు ఒంపింది గిన్నెలోకి తల్లి.

"అది బాగా వొండుతుందే సేపలకూర" అన్నాడు కొడుకు.

తల్లి తల వూపింది.

"నువ్వు తిన్నావా?..." అన్నాడు కొడుకు.

"నాకూ సంయించలేదురా!..." అంది తల్లి.

ఇంట్లోంచి ఆడది వెళ్ళిపోతే కలిగే వెలితి దుఃఖం ఆ కూర తగూ ముగిసింది.